క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు


సుజాతనగర్‌లో పూజలందుకుంటున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువైన సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గాయత్రి ఆలయ వార్షికోత్సవాలు


పూజలందుకుంటున్న అమ్మవారు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో కొలువైన వేదమాత గాయత్రీదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. కుంకుమ పూజలు జరిపారు. హోమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాద వితరణ చేపట్టారు.

ధ్యానంతో చదువులో రాణింపు


ధ్యానంలో పాల్గొన్న బాలబాలికలు

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని, నిరంతర ధ్యాన ప్రకియతో చదువులో రాణింపు ఉంటుందని పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం జీనియస్ కిడ్స్ జోన్ ప్రతినిధులు శరగడం ధార్మిక, భవ్య అన్నారు. ఆదివారం ధ్యాన కేంద్రంలో యూత్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాఖాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ అవసరమన్నారు. ధ్యానం ఒత్తిడిని జయించేలా చేస్తుందన్నారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఎలా జీవించాలో వివరించారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, నిరంతర జీవన ప్రక్రియలో ధ్యానం ఎంతో అవసరం అన్నారు. అనంత, అరుణ, ధ్యాన కేంద్ర నిర్వాహకులు, పలువురు ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ దీపు హంతకుడ్ని ఉరి తీయాలి


ఆందోళన చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

పెందుర్తి: అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీపును దారుణంగా హత్య చేసిన బన్నిని ఉరి తీయాలని స్థానిక ట్రాన్స్‌జెండర్‌లు డిమాండ్ చేశారు. ట్రాన్స్‌జెండర్ దీపు హత్యకు నిరసనగా పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ సంఘం ప్రతినిధి భవానీ మాట్లాడుతూ హత్యకు గురైన దీపు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. స్త్రీ, పురుషులకు వర్తించే చట్టాల ప్రకారమే తమకు సమస్యలు వచ్చినప్పుడు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో పెందుర్తి, చినముషిడివాడ, వేపగుంట ప్రాంతాల్లో ఉంటున్న ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు టీఎన్‌టీయూసీ కృషి

పరవాడ: కార్మికుల సమస్యలపై టీఎస్‌టీయూసీ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు అన్నారు. తానాం గ్రామంలో ఆదివారం అనకాపల్లి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

'గురుకుల' ప్రవేశ పరీక్ష వాయిదా

సబ్బవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష వచ్చే నెల 13కు వాయిదా పడినట్లు సబ్బవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6న ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సి ఉండగా, 13కు వాయిదా పడినట్లు సంస్థ కార్యదర్శి తెలిపారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాల్సిందిగా కోరారు.



ఈ ఓవర్లో వికెట్ పడుతుంది.. మీది వెయ్యి మాది ఆరు వందలు.., ఈ మ్యాచ్‌లో ఫలానా జట్టు గెలుస్తుంది.. మీ పందెం రూ.10 వేలు.. మాది రూ.15 వేలు.. ఇదీ పెందుర్తి ప్రాంతంలో సాయంత్రం పూట.. చాలా మంది నోట వినిపించే మాట. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ పోటీలు ప్రారంభం కావడంతో బెట్టింగ్‌లు కూడా జోరందుకున్నాయి. పట్టణంతో పాటు, గ్రామీణ ప్రాంతాలనూ ఈ పందాలు ముంచెత్తాయి.

బెట్టింగ్ జోరు

- బార్‌లు, హోటళ్లు, దాబాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- జోరుగా సాగుతున్న క్రికెట్ బెట్టింగ్!
- రూ.కోట్లకు చేరుకున్న జూదం?

పెందుర్తి: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు నియోజకవర్గంలో జోరందుకున్నాయి. దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, బార్‌లు, అపార్ట్‌మెంట్‌లు వేదికలుగా ఈ బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రూ.వేలు, లక్షల్లో ఉన్న పందాలు ప్రస్తుతం రూ.కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. మాయదారి బెట్టింగ్‌ల్లో నగదుతో పాటు ఆస్తులు, వాహనాలు, సెల్‌ఫోన్లు కూడా పందెంగా పెడుతున్నారు. చాలా మంది ఈ బెట్టింగ్ బారినపడి, అప్పులపాలై ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు.

గత అనుభవాలు దారుణం


ఐపీఎల్ బెట్టింగ్ కారణంగా పెందుర్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గతంలో పలు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. మూడేళ్ల క్రితం ఐపీఎల్ బెట్టింగ్ బారిన పడి పెందుర్తి మండలంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు అప్పట్లో స్థానికంగా సంచలనం రేపింది. మండలంలోని సరిపల్లి ప్రాంతానికి చెందిన ఓ బెట్టింగ్ డాన్ ఈ జూదంలో అంతా పోగొట్టుకుని, అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో కుటుంబం రోడ్డున పడిన వ్యవహారం ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉంది. ఇదిలా ఉండగా నగర వ్యాప్తంగా జరుగుతున్న బెట్టింగ్ బాగోతంలో శివారు ప్రాంత బెట్టింగ్ రాయుళ్ల పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. క్రికెట్ పరిజ్ఞానం ఉన్న యువకులతో పాటు ఇతర జూదాల్లో చేయి తిరిగిన వ్యక్తులు కూడా పాల్గొంటున్నట్లు ప్రచారం సాగుతోంది.

నియంత్రణ కరవు

వాస్తవానికి ఏ విషయంలోనైనా, ఏ స్థాయిలోనైనా.. జూదం/పందాలు పూర్తిగా నిషేధం. ఒక ప్రాంతంలో పందాలు జోరుగా సాగుతున్నప్పుడు దాన్ని నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుంది. ఇప్పటికే పేకాట, ఇతర జూదాల నియంత్రణలో విఫలమవుతున్న ఖాకీలు ఈ క్రికెట్ బెట్టింగ్‌లను ఆపలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కింది స్థాయి సిబ్బంది బెట్టింగ్ బాబులకు ఉప్పందించడంతో వాళ్లు పోలీసులు వెళ్లే సమయానికి చల్లగా జారుకుంటున్నారు. ఈసారి ఐపీఎల్ ఆరంభం నుంచే బెట్టింగ్‌లు తారాస్థాయికి చేరినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగనున్న నేపథ్యంలో ఈ బెట్టింగ్‌లు ఏ స్థాయికి చేరతాయో.. ఊహించలేమని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం స్పందించి పందాలపై పటిష్ట నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

మీది ఇంత.. మాది ఇంత

ఒక ఓవర్‌కు పరుగులు, వికెట్‌లు పడే సమయాలు, నోబాల్‌లు, వైడ్లు, ఫోర్లు, సిక్సర్లు ఇలా ప్రతి ఒక్కటీ బెట్టింగ్‌కు ముడి సరుకే. వీటికి రూ.వేలు, లక్షల్లో పందాలు వేసుకుంటున్నారు. ఆఖరుగా మ్యాచ్‌ల ఫలితాలపై భారీగానే పందాలు సాగుతున్నాయి. జట్ల బలాబలాల ఆధారంగా పందెంరాయుళ్లు బరిలోకి దిగుతున్నారు. ఒక జట్టు బలహీనంగా ఉంటే దానిపై తక్కువ మొత్తం పందెం వేస్తున్నారు. బలమైన జట్టు వైపు ఉన్నవారు దానికి కాస్త ఎక్కువ మొత్తం పందెం కాస్తున్నారు. ఉదాహరణకు బలమైన జట్టుపై రూ.పది వేలు పెడితే.. బలహీనమైన జట్టుపై రూ.5 వేలను నుంచి రూ.7 వేల వరకు పందెం కాస్తున్నారు. ఈ పందాల కోసం ప్రత్యేకంగా డెన్‌లు ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.



కఠినంగా వ్యవహరిస్తాం



పెందుర్తి సర్కిల్‌లో ఐపీఎల్ పందాల విషయం ప్రస్తుతానికి మా దృష్టికి రాలేదు. కానీ దాబాలు, బార్‌లు, ఇతర ప్రాంతాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే దాబాల్లో మద్యాన్ని అమ్మకుండా కఠిన ఆదేశాలు జారీ చేశాం. బెట్టింగ్‌పై సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లో ఎంతటివారు దొరికినా ఉపేక్షించేది లేదు.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ అసిరితాత

పెందుర్తి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ స్వామినాయుడు రౌడీ షీటర్లను హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుంటే రౌడీ షీట్‌లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన, కుటుంబ సభ్యులు సమాజంలో ఎదుర్కొనే చిన్నచూపును, వివక్షను గుర్తెరిగి మసలుకోవాలని హితవు పలికారు. రౌడీషీటర్ల ప్రవర్తన పిల్లల భవిష్యత్‌పై కూడా ప్రభావం చూపుతుందన్నారు. సంఘంలో గౌరవప్రదమైన జీవితానికి పలు సూచనలు చేశారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం


దుర్గమాంబను దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలో ఇ.బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, మేడిశెట్టి వెంకటరావు, బొండా తారక్ రమేష్‌కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి ఘటనలో నిందితులపై కేసు

- రెండు రోజుల తర్జనభర్జనల మధ్య చర్యలకు ముందడుగు
- డీఎస్పీ ఆదేశాలతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి ఘటనలో నలుగురిపై సబ్బవరం పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.271లో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు శుక్రవారం వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సింహాచలం ఆదివారం తెలిపారు. వీఆర్వోలు వినోద్, నూకరత్నం, వీఆర్‌ఏ ముదపాక అప్పారావు, ఆర్‌ఐ వీరయ్య విధులను అడ్డుకోవడం, దుర్భాషలాడటం, రాళ్లతో దాడి చేయడం, కులం పేరిట దూషించడం వంటి చర్యలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిలో గొంప ముత్యాలనాయుడు(రావలమ్మపాలెం), గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి కుమారస్వామి, లగుడు సత్యనారాయణ, పెదనాయుడుపాలేనికి చెందిన గొర్లి శ్రీనివాసరావులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

చర్యలకు పలు సంఘాల డిమాండ్

రెవెన్యూ సిబ్బందిపై భౌతిక దాడులకు దిగిన సంఘటనలు గతంలో ఏప్పుడూ జరగలేదని, రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ లేకుండా పోతే సామాన్యుల పరిస్థితి ఏంటని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారుల సంఘం, వీఆర్వోల సంఘం, వీఆర్‌ఏల సంఘాలు డిమాండ్ చేశాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు శిక్షలు విధించాలని కోరారు.

సూపర్ సిక్స్ నిల్.. కబ్జాలు ఫుల్

- ఇచ్చిన హామీలను, పాలనను పక్కనపెట్టి భూములను దోచుకుంటున్నారు
- చినముషిడివాడ సర్వే నెం.113 ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్


ఆక్రమిత స్థలంలో చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్


మీడియాతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్

పెందుర్తి: ఎన్నికల సమయంలో ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ప్రభుత్వ ఆస్తులను దోచుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. 'సూపర్ సిక్స్ నిల్–కబ్జాలు ఫుల్'అన్న చందంగా టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం పని తీరు ఉందని ధ్వజమెత్తారు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ కూడలి వద్ద సర్వే నెం.113లోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకుల అండతో ఇంత బరితెగింపుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అత్యంత విలువైన 13 సెంట్ల స్థలాన్ని కళ్ల ముందే కబ్జా చేసి, కల్యాణ మండపం నిర్మిస్తుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. తాను తహసీల్దార్‌కు ఫోన్ చేయగా అది ప్రభుత్వ స్థలమే అని చెప్పారని, అయినా చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే స్థలంలో నిర్మాణం చేపడితే తక్షణమే నిలుపుదల చేయించి, ప్రభుత్వ హెచ్చరిక బోర్డు పెట్టించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో స్వయంగా డిప్యూటీ కలెక్టర్ ఇక్కడకు వచ్చి ఆక్రమణను అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఇంత విలువైన ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకుని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కబ్జాకాండపై అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కబ్జాలు మాని, ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని కూటమి నేతలకు హితవు పలికారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, నాయకులు నారాయణ రెడ్డి, మహేష్, రజని, డీఎస్ మూర్తి, రఘు, పటాన్లయక్ ఉన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అమరవీరులకు ఘన నివాళి


భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

పరవాడ: స్థానిక బీసీవసతి గృహంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిటీష్ వలసదారుల నుంచి ఈ దేశ ప్రజలకు విముక్తి కలిగించడం కోసం అలుపెరగని పోరాటం చేసి, యుక్త వయసులోనే దేశం కోసం ఉరి కొయ్యలను ముద్దాడిన విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లని కొనియాడారు. దేశం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడిన ఆ మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, నేటి యువత దేశ ప్రగతికి పాటుపడాలన్నారు. దేశంలో చదువుకున్న యువతకు సరైన ఉపాధి అవకాశాల్లేక తప్పుడు మార్గాల్లో పయనిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా యువతను మోసం చేస్తున్నాయన్నారు. నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని భగత్‌సింగ్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్‌ను అమలు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


అదృశ్యమైన శివప్రసాద్

పెందుర్తి: స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం(అయ్యప్ప) కాలనీకి చెందిన నరవ శివప్రసాద్ అదృశ్యంపై కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న శివప్రసాద్ ఆరిలోవలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి డ్యూటీకి అని వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్‌ఏటీకి 147 మంది హాజరు


పరీక్షల నిర్వహణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

సబ్బవరం: ఉల్లాస్ నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్(ఎఫ్ఎల్ఎన్ఏటీ) ఆదివారం నిర్వహించారు. మండలంలోని 49 గ్రామ సంఘాల్లో ఉన్న 41 అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 490 మంది మహిళలకుగాను 467 మంది పరీక్షకు హాజరయ్యారు. 15 ఏళ్లు దాటిన మహిళలకు అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానం నేర్పేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. ఎంపీడీవోతో పాటు వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, ఎంఈవో రవీంద్రబాబు, ఐసీడీఎస్ సిబ్బంది, వెలుగు సీసీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అదృశ్యమైన వివాహిత ఆచూకీ లభ్యం

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి, వేపగుంట ప్రాంతానికి చెందిన ఓ మహిళ, ఆమె ఇద్దరు పిల్లల మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. దాదాపు 25 రోజుల క్రితం మహిళ(32), ఇద్దరు పిల్లలు(10, 07) అదృశ్యమయ్యారు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ స్వామినాయుడు బృందం కేసు దర్యాప్తు చేపట్టింది. ఆదివారం వారి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మరో కేసులో యువకుడి ఆచూకీ లభ్యం

నాయుడుతోట ప్రాంతానికి చెందిన ఓ యువకుడు రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ నాగేశ్వరరావు దర్యాప్తు చేపట్టారు. నగరంలో తిరుగుతున్న యువకుడ్ని ఆదివారం ఉదయం గుర్తించిన పోలీసులు, అతడ్ని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అ'పూర్వ' సమ్మేళనం


నంగినారపాడు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2014–15 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం సందడిగా జరిగింది. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, ప్రస్తుత స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. కలసి చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఏడాదికోసారి పాఠశాల ఆవరణలో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఫొటోలు దిగి, జ్ఞాపకాలను భద్రంగా దాచుకుంటూ తిరుగుముఖం పట్టారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


మృతదేహం వద్ద పరిశీలిస్తున్న పోలీస్ (ఇన్‌సెట్) మృతుడు అప్పలస్వామి (ఫైల్)

సింహాచలం: 98వ వార్డు పరిధి అడవివరంలోని విజినిగిరిపాలెం శ్మశాన వాటిక సమీపంలో ఓ వ్యక్తి కల్లు గీస్తూ చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. విజినిగిరిపాలెంలో నివాసం ఉంటున్న కల్లుగీత కార్మికుడు బాడిదబోయిన అప్పలస్వామి(48) ఆదివారం ఉదయం కల్లుగీతకు చెట్టెక్కాడు. ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. తీవ్ర గాయాలవడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు పోలీసులు తరలించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు గణేష్(13), కుమార్తె శ్రావ్య(11) ఉన్నారు.